
ప్రజాశక్తి

బుధవారం 10 సెప్టెంబర్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సకాలంలో ఎరువులు అందించండి..

- అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చర్యలు
- ఎఫ్‌సిఒ చట్టంపై డీలర్లకు అవగాహన
- అధికారులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రైతులకు సకాలంలో నాణ్యమైన ఎరువులను, ముఖ్యంగా యూరియాను నిర్దిష్ట ధరలకు అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రైవేట్ డీలర్లు నిబంధనల మేరకు పని చేస్తూ అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆమె కోరారు. జిల్లాలోని ఎరువుల డీలర్లతో మంగళవారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ఊపందుకోవటం, ఎరువుల అవసరం - లభ్యత, షాపుల నిర్వహణ తీరు, ఉల్లంఘిస్తే ఎఫ్.సి.ఓ.-1985 చట్టం ప్రకారం తీసుకునే చర్యలపై డీలర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియాకు కొరత లేదని పునరుద్ఘాటించారు. అవసరం మేరకు ప్రభుత్వం కేటాయించిందని, ఇందులో 70 శాతాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా, మిగిలిన 30 శాతాన్ని ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్ డీలర్లు కూడా రైతులలో ఎలాంటి ఆందోళనకు ఆస్కారం లేకుండా ఎరువులను విక్రయించాలని ఆమె తెలిపారు. షాపులకు ఎరువులు చేరినప్పటి నుంచి వాటిని రైతులకు విక్రయించే వరకు నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎరువుల లభ్యతకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఐఎఫ్ఎంఎస్ సైట్ లో నమోదు చేస్తూ ఉండాలన్నారు. ఇదే విషయాన్ని వాటి ధరలతో సహా రైతులకు ▶ 2లో

ముదురుతున్న భూవివాదం..!

- నగరంలో విలువైన స్థలంపై రగడ..
- సుజాతనగర్ వెనుక భూమిపై 1979 నుంచీ కోర్టు కేసులు
- రెండు గ్రూపుల మధ్య కొనసాగుతున్న పేచీలు..
- తర్వాత ప్లాట్లు వేసి..అమ్మకాలు..
- వివాదాల్లోకి కొనుగోలుదారులు



వివాదాస్పద స్థలం ఇదే..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నగరంలోని సుజాతనగర్ వెనుక ఉన్న విలువైన భూమి అది. సుమారు 16 ఎకరాల వరకూ ఉంటుంది. దానిపై హక్కుల కోసం రెండు గ్రూపుల మధ్య 1979 నుంచీ ఇప్పటి వరకూ కోర్టుల్లో కేసులు నడుస్తూనే ఉన్నాయి. కోర్టు తీర్పులు రావడం.. తీర్పు వ్యతిరేకంగా ఉందని భావించిన వర్గం మళ్లీ అప్పీలుకు పోవడం వంటివి కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికీ కేసులు నడుస్తూనే ఉన్నాయి. అయితే ఈ భూములను ఒకరు వెంచర్లు వేసి అమ్మారు. సుమారు 70 మందికి పైగా వాటిని ఇళ్ల కోసం కొన్నారు. ఇప్పుడు వీళ్లు కూడా వివాదంలోకి వెళ్లారు. కారణం ఆ భూమిలో పంపకాలు మొదలు హద్దులు నిర్ణయించుకునే విషయంలోనూ సరైన పద్ధతిలో జరగలేదు. దీంతో అప్పటి నుంచీ హక్కుదారుల మధ్య ఉన్న వివాదాలు ఇప్పుడు ఆ భూముల్లో వెంచర్లు వేయగా కొన్న కొనుగోలుదారులూ వివాదాల్లోకి చేరారు. బాధితులుగా నిలిచారు. కోర్టుల చుట్టూ తిరగలేక తమ ప్లాట్లను వాళ్లే స్వయంగా స్వాధీనం చేసుకున్నారు. ఆ భూమిలోకి వెళ్లి చుట్టూ కంచె వేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఒక వర్గం వారు బలవంతంగా కబ్జా చేశారంటూ ఆరోపించారు. పోలీసులను ఆశ్రయించారు. దీంతో తెరపైకి తాజాగా మరో కొత్త వివాదం వచ్చింది.ఇది సహజంగానే రాజకీయ రంగు పులుముకోవడం సహజం. పంచాయితీలు నిర్వహించేందుకు పాలకపక్షనేతలూ రంగంలోకి దిగడం వంటివి జరిగిపోయాయి. ఈ వ్యవహారం పట్టణంలో తీవ్ర చర్చకు తావిచ్చింది.

భూమి చరిత్ర వివాదం పూర్వపరాలు ఇలా..

సుజాతనగర్ వెనుకబాగంలో సర్వే నెంబరు 2221, 221బై2, 223 సర్వేనెంబర్లలో 16 ఎకరాలు భూమి ఉంది. ఇది పూర్వం పట్టణానికి చెందిన బండారు జాలయ్య అనే వాళ్ల కుటుంబీకులకు చెందింది. వీరిలో కొంత అంటే సగం భూమిని వాటాదారులు ముగ్గురు 1894లో పేర్లచిన్నబ్బి అనే వ్యాపారికి అమ్మారు. ఇది పోగా సగం బండారు జాలయ్య కుటుంబాలకు ఉంది. దీన్ని వెంచర్లు వేయగా 1980 నుంచీ అమ్మకాలు జరిగాయి. సుమారు 70 మందికి పైగా ఈ భూముల్లో బండారు కుటుంబీకులు వేసిన వెంచచర్లలో ప్లాట్లు కొన్నారు. అయితే ఈ భూమి మొత్తం ▶ 2లో

ప్రజల తిరుగుబాటుతోనే

ప్రజాస్వామ్య సమాజం సాధ్యం

- మార్క్సిజం ద్వారానే సమాజ మార్పు
- ఏచూరి వర్ధంతి సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సామ్రాజ్యవాదుల కోసం, పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం భారత ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్న నిరంకుశ పాలకులపై ప్రజలు తిరుగుబాటు చేయాలని, అప్పుడే ప్రజలు కోరుకునే ప్రజాస్వామ్య సమాజం ఏర్పడుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక సుందరయ్య భవన్‌లో సిపిఎం పూర్వ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు జాలా అంజయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 'వర్తమాన రాజకీయ పరిస్థితులు - సిపిఎం వైఖరి' అంశంపై పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో రమాదేవి మాట్లాడారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తొలితరం నవరత్నాలుగా ఉన్న కమ్యూనిస్ట్ నేతలు అందించిన స్ఫూర్తితో భారదేశం మార్క్సిస్టు ఉద్యమ నిర్మాణానికి ఏచూరి కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. జాతీయోద్యమం అనంతరం కాంగ్రెస్ అధికారం చేపట్టగా కమ్యూనిస్టులు సోషలిజం కోరుకున్నారని, అధికారం చేపట్టిన పాలకులు పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం కట్టుబడి ఉన్నట్లు ఉద్యమ చరిత్రను ప్రస్తావించారు. ప్రపంచంలో ఎక్కడా లేని మత సమాజం, కుల సమాజం భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సనాతన ధర్మం పేరున హిందూ రాజ్యంగా మార్చడానికి, చరిత్రనే వక్రీకరిస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగ వ్యవస్థ మొదలు, పార్లమెంట్ వ్యవస్థ, న్యాయ వ్యవస్థ, ఎన్నికల వ్యవస్థను మోడీ చెప్పు చేతల్లో ఉంచుకున్నాడని ఆరోపించారు. పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం భారతదేశంలో అన్ని వ్యవస్థలను ధ్వంసం చేయడంతో పాటు స్వరూపాన్నే మారుస్తున్నారని దుయ్యబట్టారు. పేద ప్రజలు కలలుగన్న ఆర్థిక వ్యవస్థ ఏర్పడటానికి సమాజమార్పు రావాలని, ఇది మార్క్సిజం ద్వారా మాత్రమే సాధ్యం అవుతుందన్నారు. మార్క్సిజం లేకుండా సమానత్వం సాధించలేమన్నారు. ప్రజల తిరుగుబాటు ద్వారానే ఇది సాధ్యం ▶ 2లో

లైంగిక వేధింపుల కేసులో

ఎంపీడీవో చక్రపాణి సస్పెన్షన్

ప్రజాశక్తి-తర్లుపాడు

లైంగిక వేధింపుల కేసులో తర్లుపాడు ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ సస్పెండ్ అయ్యారు. ఉపాధి హామీ కార్యాలయంలో రోజువారీ వేతనానికి పనిచేస్తున్న దళిత ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ పాల్పడినట్లు జూలై 23న బాధితురాలు తర్లుపాడు పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేశారు. దర్శి డిఎస్‌పి లక్ష్మీనారాయణ ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందిని విచారించి నివేదికను, జిల్లా విచారణ కమిటీకి అందజేశారు. స్థానిక ఫిర్యాదు కమిటీ విచారణ నిర్వహించి.. ప్రాథమిక సాక్ష్యంతో కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది.



ఒంగోలులో వైసిపి నాయకులు, కార్యకర్తల భారీ ర్యాలీ

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

▶ 5లో

ముదురుతున్న భూవివాదం

(మొదటిపేజీ తరువాయి)

బండారు వంశీయుల ఆధీనంలోనే ఉంది. అప్పట్లో పొలం కొనుగోలు చేసిన పీర్ల వంశీయులు కూడా దీన్ని స్వాధీనం చేసుకోలేదు. అయితే 1965లో వీలుమానా ఆధారంగా పీర్ల వంశీయుల నుంచీ మనవడు పేరుతో హక్కు వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇక్కడ నుంచీ నూనె మోహన్‌రావు, రవికుమార్ కుటుంబీకులు హక్కుదారులుగా ఉన్నారు. ఈ భూవివాదంతోకి వీళ్లు హక్కుదారులుగా ఉన్నారు. మరోవైపు బండారు వాళ్లు ఉన్నారు. ఈ రెండు కుటుంబాల మధ్యనే హక్కుల విషయంలోగానీ, కౌలు విషయంలోగానీ 1979 నుంచీ కేసులు నడుస్తున్నాయి. అయితే ఇరుకుటుంబాలకు చెరిసగం భూమి కోర్టుల ద్వారా చెందింది. దీన్ని సకాలంలో స్వాధీనం చేసుకోవడం, కాపాడుకోవడం, హద్దులు నిర్ణయించుకుని అనుభవంలోకి తీసుకోవడంలో నిర్లక్ష్యమే కొంపముంచింది. ధరలు పెరిగాక ఇపుడు భూముల పరిస్థితి చెప్పేదికాదు. అప్పట్లో ఎకరం రెండు వందలకు రాయించుకున్నారని సమాచారం. ఇపుడ అక్కడ ఎకరం కోట్లలో ఉంది.ఇపుడు ఎవరివాదనలు వాళ్లవిగా ఉన్నాయి.

8.16 ఎకరాలు మా తాత ద్వారా సంక్రమించింది

నూనె రవికుమార్

1965లో మా తాత మా అన్నను దత్తతు తీసుకుని సర్వేనెంబరులోని 221, 222బై2,223లో భూమిని ఇస్తూ వీలుమానా రాశారని నూనె రవికుమార్ తెలిపారు. ఈ భూమిని కొందరు ఆక్రమించారని ఆరోపించారు.పోలీసులకు ఆయన పిర్యాదు చేశారు. 1979లో కౌలు చెల్లించనందున ఉమ్మడి పొలంగా ఉన్నందున దాన్ని పార్టీషన్ చేయాలని కోర్టులో కేసువేశామన్నారు.1994లో కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు.ఈభూమిలో బాగస్వాములుగా ఉన్న బండారు కుటుంబీకులు హైకోర్టుకు వెళ్లగా అక్కడా మాకు తీర్పు అనుకూలంగా వచ్చిందన్నారు.2003 లో 8.16 ఎకరాలు తమకు స్వాధీనం చేసిందన్నారు.2005లో వీలునామా ద్వారా భూమి పొందిన వ్యక్తి తన అన్నదమ్ములకూ కొంత వాటా ఇస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.కొందరు కేసులు కోర్టులో ఉండగా వేసిన వెంచర్లలో ప్లాట్లు కొన్నారని,అవి చెల్లుబాటు కావని రవికుమార్ చెప్పారు.వాళ్లే ఇపుడు భూమిలోకి చొరబడి చుట్టూ కంచెవేశారని ఆరోపించారు.

బండారు కుటుంబీకుల భూముల్లోనే కొనుగోలు

ఈ భూములు బండారు కుటుంబీకులు కొంత భూమిని అమ్ముకోగా మిగిలిన 7.94 ఎకరాల్లోనే వెంచర్లు వేశారని, వాటిని తాము కొనుగోలు చేసినట్లు ప్లాట్ల యజమానులు చెబుతున్నారు.1980 నుంచీ తాము ఈప్లాట్లను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నట్లు చెప్పారు.పీర్ల చిన్నబ్బి అనే వ్యాపారి అప్పట్లో ఎంత కొన్నారో గానీ అప్పటి నుంచీ బడారు వాళ్ల కిందే భూమి ఉందన్నారు.అయితే అమ్మకాలు, పంపకాల్లో సరైన మార్గంలోవెళ్లనందునే వాళ్ల మధ్య పేచీలున్నట్లు తెలిపారు.1917లోనే పీర్లబిన్నబ్బి అనే వ్యక్తి తాను కొనుగోలు చేసిన భూమిని 1917లో పాదర్తి బుచ్చంశెట్టికి అమ్మినట్లు డాక్యుమెంటు కూడా ఉందన్నారు.ఏదేమైనా వీలునామా ద్వారా సంక్రమించిన ఆస్తికీ,తాము కొన్న ఆస్తికి సంబంధంలేదని ప్లాట్లు కొనుగోలు దారులు చెబుతున్నారు.వాళ్లభూమి వాళ్లకు ఉందని చెబుతున్నారు.అయితే పంపకాల్లో భూమిని అడ్డంగా పంపకాలు చేయకుండా నిలువునా అంటే ఉత్తరం నుంచీ దక్షిణంకు కొలతపెట్టి చీల్చడం వల్లనే సమస్య తలెత్తిందని కొనుగోలు దారులు వాపోతున్నారు. సుజాతనగర్ రోడ్డుకు దగ్గరగా భూమి వచ్చేలా కొలవడం వల్లనే సమస్య వచ్చిందన్నారు. ఏదేమైనా ఇపుడు ఆ భూమిలో వేసిన ప్లాట్లను కొనుగోలు చేసిన వాళ్లు కూడా ఏళ్లతరబడి కోర్టులచుట్టూ తిరుగుతున్నారు.భూమి పూర్వహక్కుదారుల మధ్య వివాదాల వల్ల ప్లాట్లు కొనుగోలు చేసిన వాళ్లు కూడా ఇపుడు బాధితులుగా మారారు.ఏంచేయాలోదిక్కుతోచక బలవంతంగా తమ ప్లాట్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజల తిరుగుబాటుతోనే ప్రజాస్వామ్య సమాజం

(మొదటిపేజీ తరువాయి)

అవుతుందని ఆమె పేర్కొన్నారు. దీనిని ప్రజాపోరాటాల ద్వారానే సాధించగలమని, ఆ దిశగా ప్రజలను చైతన్య వంతం చేయాలని చెప్పారు. అప్పుడే ఏచూరికి అందించే ఘన నివాళి అని ఆమె ప్రకటించారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పూలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు, కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, నగర నాయకులు జి రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలతో.. అల్లాడిన జనం..!

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంతంలో కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. వాతావరణం చల్లగా ఉండాల్సిన కాలంలో ఈ ఎండలేమిటని జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 11 గంటల సమయంలో రహదారుల్లోకి జనం రావాలంటే జంకుతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు వేడిమి తగ్గడం లేదు. గడచిన మూడు రోజులుగా మార్కాపురం పట్టణంలో 36 నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పైగా ఉక్కపోత కొనసాగుతోంది. వేసవిని తలపిస్తున్న ఎండలతో చిరు వ్యాపారులు మలమల మాడిపోతున్నారు. కొనుగోలు చేసే జనం కూడా తగ్గిపోవడంతో చిరు వ్యాపారులు ఎదురు చూడాల్సివస్తోంది. పెరిగిన ఎండల కారణంగా రహదారులన్నీ పగటిపూట కర్ఫ్యూ వాతావరణాన్ని గుర్తు చేస్తోంది. ఈ వేడిమికి చిన్నారులు, వృద్ధులు తట్టుకోలేకున్నారు. పదును వర్షం కురిసినా కొద్ది రోజులు ఈ ఎండ నుంచి తప్పించుకోవచ్చని జనం ఆకాశం వైపు చూస్తున్నారు.



నిర్మానుష్యంగా రహదారులు

గాయపడిన వ్యక్తికి పరిహారం చెల్లింపు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

నెక్కంటి అటవీ ప్రాంతంలో ఇష్ట కామేశ్వరి గూడేనికి చెందిన చెవుల వెంకటేష్ గతంలో ఎలుగుబంటి దాడిలో గాయపడ్డారు. ఈ మేరకు అటవీ శాఖ అధికారులు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.75 వేలు మంజూరు చేయగా ఆ చెక్కును ఫారెస్ట్ బీట్ అధికారి యు మదన్ బాధితుడికి మంగళవారం అందజేశారు.



చెక్కు అందజేస్తున్న బీట్ ఆఫీసర్ మదన్

బాబాయ్‌పై దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి-కంభం రూరల్

మండలంలోని రావిపాడు గ్రామంలో ద్విచక్ర వాహనం కొనివ్వలేదని సొంత బాబాయిపై కుమారుడు దాడి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు. గ్రామానికి చెందిన అభిషేక్‌రెడ్డి తన బాబాయి శ్రీనివాసరెడ్డిని ద్విచక్ర వాహనం కొనివ్వాలని అడగగా అందుకు ఆయన నిరాకరించడంతో ఆగ్రహానికి లోనైన అభిషేక్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిపై దాడికి పాల్పడినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

మోటార్ సైకిల్ నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న మహిళ జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఐనముక్కల గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా... ఐనముక్కల గ్రామానికి చెందిన దర్శనం నాగమ్మ(59) పొలంలో ఉన్న భర్త కాశయ్యకు భోజనం ఇచ్చేందుకు రోడ్డుపైకి వచ్చింది. పొలం వరకు నడవకుండా వెళ్లేందుకు ఆ మార్గంలో వస్తున్న మోటార్ సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగింది. వృద్ధ మహిళ కావడంతో ఆ వ్యక్తి మానవత్వంతో మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నారు. ఫర్లాంగు దూరం ప్రయాణించిన తరువాత నాగమ్మ కళ్లు తిరిగి పడిపోయింది. వెంటనే పెద్దదోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స అందుతున్న తరుణంలో నాగమ్మ మృతి చెందింది.

పాస్‌పోర్ట్ పోయింది

బాపట్ల జిల్లా రేపల్లె మండలం రాజుకాలవ గ్రామానికి చెందిన తలపనేని నందిని D/o శివాజీ కులము కమ్మకు చెందిన పాస్‌పోర్ట్ పోయింది. పనిమీద రేపల్లె వచ్చి తాలూకా సెంటర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లో జిరాక్స్ తీయించుకుని ఆటోలో ఇంటికి ప్రయాణం చేస్తూ ఉండగా పాస్‌పోర్ట్ No.X6750378 మార్గమధ్యలో జారిపడిపోయింది. పాస్‌పోర్ట్ దొరికిన వారు ఫోన్ నెంబర్‌కు 8106265646 అందించవలసిందిగా కోరుతున్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల ఏబీఎం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గౌతవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం మండల విద్యాశాఖ అధికారి వి గిరిజన శర్మ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. గౌతవరం యూపీస్కూల్లో విద్యార్థులు భోంచేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాచర్ల క్లస్టర్ చైర్మన్ బిఎల్ రామ్ నాయక్ పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించండి

(మొదటిపేజీ తరువాయి)

తెలిసేలా షాపుల ముందు డిస్‌ప్లే చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు యూరియా విక్రయిస్తే చట్టప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఎరువులను కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని పునరుద్ఘాటించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేలా ఎరువుల షాపులను తనిఖీ చేసేందుకు రెవిన్యూ, పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ , వ్యవసాయ అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎరువులను వినియోగించేలా రైతులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ హరికిష్ణ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ

మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెం: 296/2023

Syndicate Bank now merged in
Canara Bank, Markapur Branch,
.... plaintiff
Rep. by its chief Manager
Vs
Devalla Venkata Ramana Reddy and another S/o Krishna Reddy, age about 40 years, Hindu, R/o Sri Balaji Agency (opp. Santhi Clinic), college road, Markapur town and Mandal, Prakasam Dt.

పై నెంబరు దావాలోని దావా పరిహారం నిమిత్తం అనగా 24-01-2006వ తేదీన వాది/బ్యాంకు వద్ద 1వ ప్రతివాది రూ.1,20,000/-లు పర్సనల్ లోన్ తీసుకుని 60 వాయిదా పద్ధతిలో, ప్రతి వాయిదాకి రూ. 2761/-లు చెల్లించేలాగా మీరు వాది/బ్యాంకు పేర జనరల్ అగ్రిమెంట్ మరియు గ్యారంటీ అగ్రిమెంట్ వ్రాసియ ఇచ్చియున్నారు. తదుపరి వాది/ బ్యాంకు లోన్ చెల్లించనందున మీపైన వాది/ బ్యాంకు పై కోర్టులో, పైనెంబరు దావా దాఖలు చేసియున్నాడు. ఇందు విషయమై 1వ ప్రతివాదికి పలుమార్లు దావా సమన్లు పంపగా, అవి మీకు ముట్టని కారణం చేత ఈ దిన పత్రిక దావా సమను ద్వారా 1వ ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా 22-09-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పైకోర్టులో మీరు స్వయముగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలసినది. లేని యెడల ఈ పరోక్షం యందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 22-09-2025

స్థలం: మార్కాపురం

కె.అచ్చిరెడ్డి
వాది తరపున అడ్వకేట్
మార్కాపురం,
సెల్: 9014154583.

మహారాజశ్రీ

మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.145/2023

ఓ.ఎస్.443/2020

కొర్రా వెంకటేశ్వర నాయక్... పిటీషనర్/డి.హెచ్.ఆర్
వర్సెస్
మాసునూరి యలమందల కోటిలింగం
(చనిపోయినందున వారసులు)
మాసునూరి పద్మావతి మరియు ఇతరులు
..... రెస్పాండెంట్లు/జె.డి.ఆర్స్ టు,

జె.డి.ఆర్-1:
మాసునూరి పద్మావతి,
భర్త: యలమందల కోటిలింగం
వయసు: 45 సం॥లు,

జె.డి.ఆర్-2: మాసునూరి శివక్రిష్ణ,
తండ్రి: యలమందల కోటిలింగం,
వయసు: 27 సం॥లు,

జె.డి.ఆర్-3: మాసునూరి లక్ష్మి కోమల
తండ్రి: యలమందల కోటిలింగం,
వయసు: 20 సం॥లు,

జె.డి.ఆర్-4: మాసునూరి వినయ్‌క్రిష్ణ,
తండ్రి: యలమందల కోటిలింగం,
వయసు: 19 సం॥లు,

అందరి నివాసం: వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గర, కొండేపల్లి రోడ్డు, మార్కాపురం టౌన్, మార్కాపురం మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు ఇ.పి.లోని డి.హెచ్.ఆర్, ఇ.పి. నగదును రాబట్టుకొనుటకు లేట్ మాసునూరి యలమందల కోటిలింగం యొక్క వారసులైన జె.డి.ఆర్స్ 1 నుండి 4లపై ఇ.పి. దాఖలు చేయగా పై కోర్టు వారు జె.డి,ఆర్స్ 1 నుండి 4 లకు నోటీసులు పంపగా, మీరు కోర్టు నోటీసులు తీసుకొనక తిరిగి పంపటం చేత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు జె.డి.ఆర్సులు 1 నుండి 4ల నోటీసు నిమిత్తం 06-10-2025న వాయిదా వేసి ఉన్నారు. కనుక ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పైన తెలిపిన కోర్టులో జె.డి.ఆర్స్ 1నుండి4 వరకు మీరు స్వయముగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

టి.వెలుగొండయ్య
డి.హెచ్.ఆర్. తరపు అడ్వకేట్
మార్కాపురం, ప్రకాశం జిల్లా.
సెల్: 9963287257.

నేటి నుంచి అనధికార పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి-కొండపి

అదనపు పొగాకు విక్రయాలపై అతి తక్కువ పెనాల్టీతో నేటి నుంచి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు కొండపి వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా, అనధికారికంగా పండించిన పొగాకు అమ్మకానికి భారత వాణిజ్య పరిశ్రమల శాఖ అనుమతి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. వారి ఆదేశాల మేరకు బోర్డు అనుమతించిన పరిమితిలో 10 శాతం అధిక ఉత్పత్తికి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా సాధారణ చార్జీతో ఒక శాతం, 10 శాతం నుంచి 20 శాతం వరకు సాధారణ సర్వీస్ ఛార్జ్ ఒక శాతంతో పాటు అదనపు సర్వీస్ ఛార్జ్ రెండు శాతం, కిలోకి ఒక రూపాయి చొప్పున, 20శాతం పైన అమ్మకమునకు సాధారణ సర్వే చార్జీ ఒక శాతంతో పాటు అదనపు సర్వీస్ శాతం మూడు, కిలోకి ఒక రూపాయి అపరాధ రుసుము ఉంటుందని తెలిపారు. రైతులు పొగాకు బోర్డును సంప్రదించి అధిక పొగాకు విక్రయం కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ దరఖాస్తులు ఒకసారి మాత్రమే స్వీకరించబడతాయని పేర్కొన్నారు. వాణిజ్య సరళిలో పెంచే పొగాకు నారుమడులకు కచ్చితంగా పొగాకు బోర్డు వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లేనియెడల పొగాకు బోర్డు చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ కానీ పొగాకు నారుమడుల యాజమాన్యంల వద్ద రైతులెవరూ పొగాకు నారును కొనుగోలు చేయరాదని తెలిపారు.



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్ కుమార్

బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా చూడాలి

వేలానికి తీసుకొని వచ్చే బేళ్లల అన్య పదార్థాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం వేలం సందర్భంగా రైతులకు పలు సూచనలను సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బేళ్ళకి అధిక ధర పలుకుతుందన్నారు. పంటల మార్పిడి చేసుకోవాలని బోర్డ్ అనుమతించిన మేర పొగాకున సాగు చేయాలని సూచించారు. రైతులు తమ వద్దనున్న బేళ్ళ వివరాలను తెలియజేయాలన్నారు. వేలానికి ఒక రోజు ముందు వచ్చి మార్కెట్ వివరాలను తెలుసుకోవాలని సూచించారు. క్లస్టర్ పరిధిలోని చోడవరం, ముప్పవరం, చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు 669 బేళ్లను వేలానికి తీసుకుని వచ్చారు. అందులో 364 బేళ్లు కొనుగోలు అయ్యాయి. వ్యాపారుల వివిధ కారణాలతో 305 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.318, కనిష్ట ధర కేజీ రూ.120, సరాసరి ధర కేజీ రూ.183.86గా నమోదయింది. వేలంలో 16 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. మంగళవారంతో 11వ రౌండ్ ముగిసిందని బుధవారం నుంచి 12వ రౌండ్ పొగాకు వేలం ప్రారంభమవుతుందని రైతులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

వైసీపీ కుట్రలు ఎప్పటికీ చెల్లవు : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

నీతి నిజాయితీ, విలువలు కలిగిన రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం నారా చంద్రబాబు నాయుడని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు ప్రకాశం జిల్లా తూర్పునాయుడుపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే రోజున అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారని, రాష్ట్ర చరిత్రలోనే ఇది చీకటి రోజు అన్నారు. వైసీపీ పతనానికి నాంది పలికిన రోజు కూడా అదే అన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేసి జైల్లో పెట్టినా ప్రజలు ఆయన్ని కడిగిన ముత్యంలా సీఎం సీటులో కూర్చోబెట్టారని తెలిపారు. ప్రజల ఆశీర్వాదం ఉన్న సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ కుట్రలు, కుతంత్రాలు ఎప్పటికీ చెల్లవని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



తూర్పునాయుడుపాలెంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

పాఠశాల నిర్మాణ పనుల పరిశీలన

తూర్పునాయుడుపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పలు నిర్మాణ పనులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పరిశీలించారు. మంగళవారం నాడు స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి మంత్రి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పలు సూచనలు చేశారు. తరగతి గదులను పరిశీలించి ఎక్కడా నాణ్యత లోపం లేకుండా నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తల్లపనేని రవికుమార్, హెచ్ఎం వి.సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి లీలాశ్యాంసుందరికి స్వాగతం పలుకుతున్న న్యాయవాదులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ విభాగం)నకు రెగ్యులర్ ప్రాతిపదికన న్యాయమూర్తిగా వి.లీలాశ్యాంసుందరి మంగళవారం బాధ్యత తీసుకున్న నేపథ్యంలో శింగరాయకొండ బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇకమీదట రెగ్యులర్‌గా శింగరాయకొండ కోర్టును నిర్వహిస్తారని, అదేవిధంగా ఈనెల 13వ తేదీన రెండవ శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శింగరాయకొండ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ ఆదాలాత కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా కేసులు త్వరితగతిన పరిష్కారం పొందేందుకు లోక్ అదాలత్ మంచి వేదిక అని, దీని ద్వారా కేసులు పరిష్కారం కావడం వల్ల సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని తెలిపారు. సివిల్, క్రిమినల్, వ్యాజ్యేతర కేసులు, పెండింగ్‌లో ఉన్న వివాదాలు వంటి అనేక కేసులను కోర్టులో తీర్పుకు వెళ్లకుండా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో శింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు, కార్యదర్శి బక్కముంతలవెంకటేశ్వర్లు, న్యాయవాదులు పంతగాని వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాఘవేంద్ర, రియాజ్ పఠాన్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్

ప్రజాశక్తి-దొనకొండ

దొనకొండ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తూ ఎట్టకేలకు రైల్వే ఉన్నతాధికారులు అధికారికంగా సోమవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. 17211 మచలీపట్నం-యశ్వంత్‌పూర్, 17212 యశ్వంత్‌పూర్ మచలీపట్నం, 17225 నర్సాపూర్-హుబ్లీ, 17226 హుబ్లీ- నర్సాపూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌లు, 18047 షాలీమార్- వాస్కోడిగామా, 18048 వాస్కోడిగామా-షాలీమార్ అమరావతీ ఎక్స్‌ప్రెస్‌లు, 18463 భువనేశ్వర్-బెంగుళూర్, 18464 బెంగుళూరు, భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ సౌకర్యం కల్పిస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత ఐదేల్లుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ సౌకర్యం లేకపోవటంతో తాము ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తించి రైళ్ల స్టాపింగ్‌కు విశేష కృషి చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి దొనకొండ ప్రాంత ప్రజలు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి : సిపిఎం అగ్ర నాయ కులు సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిపిఎం ఆధ్వర్యం లో ఘన నివాళులర్పించారు. మంగళవారం స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనం ఆవర ణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లాపల్లిఆంజనేయులు మాట్లాడుతూ సిపిఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి నిరంతరం లౌకిక రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి పార్లమెంట్ లోపల, పార్లమెంటు బయట అనేక ఉద్యమాలకు పోరాటాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. వర్తమాన పరిస్థితులలో భారతదేశానికి మార్క్సిజాన్ని అమలు చేయడంలో ఆయన ప్రముఖ పాత్ర వహించారన్నారు. ఆయన ఆశయాల తమల కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, పొత్తూరి సురేష్, తొట్టెంపూడి రామారావు, శీలం ఆదినారాయణ, పులి ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.



సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న నాయకులు



సాయికృష్ణ మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న పోలీసులు

అలల తాకిడికి విద్యార్థి మృతి

ప్రజాశక్తి-బాపట్ల

సముద్రంలో కొట్టుకుపోతున్న వారిని కాపాడబోయి ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మంగళవారం సూర్యలంక బీచ్‌లో జరిగింది. మెరైన్ పోలీసుల వివరాల మేరకు.. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సాయికృష్ణ, వెంకటేష్, కార్తీక్ సూర్యలంక బీచ్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చారు. వీరు సముద్ర స్నానం చేస్తున్న క్రమంలో హైదరాబాదుకు చెందిన ఇద్దరు యువకులు ఓ యువతి అలల తాకిడికి గురై కొట్టుకుపోతుండగా రక్షించే ప్రయత్నం చేసిన సాయికృష్ణ (21) అలల్లో చిక్కుకొని మృతి చెందాడు. హైదరాబాద్ వాసులను, సాయి కృష్ణను మెరైన్ పోలీసులు, గజగతగాళ్లు ఒడ్డుకు చేర్చారు. హైదరాబాద్ వాసుల ప్రాణాలు మాత్రం కాపాడగలిగారు. అప్పటికే వాళ్లను కాపాడేందుకు వెళ్లిన సాయికృష్ణ ప్రాణాలు మాత్రం అలల్లో కలిసిపోయాయి. సాయిక్రిష్ణ మృతదేహాన్ని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. స్నేహితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-అద్దంకి

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం పోలవరంల జరిగింది. వివరాలలోకి వెళితే మండలంలోని పోలవరం ఎస్సీ కాలనీకి చెందిన నంబూరి జకరయ్య(67) తన ఇంటిలో నీళ్ల అవసరం నిమిత్తం మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో గురై అక్కడి అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. పోలవరం ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

వాటర్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

వాటర్ ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుండ్లపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన దార్ల ఉదయ్ రాజ్ కుమార్ గుండ్లపల్లి ఫ్లైఓవర్ కింద రోడ్డు దాటుతుండగా ఓ ఫ్యాక్టరీకి చెందిన వాటర్ ట్యాంకర్ ఢీ కొనడంతో ఉదయ రాజకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-దర్శి : ఉత్తమ ఉపాధ్యాయులును దర్శి మండల యుటిఎఫ్‌శాఖ యుటిఎఫ్ దర్శి భవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, టి.రాజశేఖర్, విజయ్‌కుమార్, గౌరవ అతిథులుగా దర్శి మండల ఎంఇఓలు కె.రఘురామయ్య, బి.రమాదేవిలు పాల్గొన్నారు. వీరు జిల్లా స్థాయిలో ఉత్తమ అధికారులుగా కూడా ఎన్నిక కాబడ్డారు. వీరిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా జి.మల్లికార్జున, తెలుగు పండిట్, ఎస్‌కె.కబీర్, ఎన్‌బి.గీతాదేవి, అనసూయ చేసిన సేవలకు గుర్తింపుగా ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అనేది హక్కుల కోసం ఎంత నిలబడుతుందో కార్యకర్తలను కూడా అంతే గౌరవిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, గౌరవ అధ్యక్షులు ఎం.యలమందారెడ్డి, సహాధ్యక్షులు రామారావు, ఎల్ఆర్.స్రవంతి, కోశాధికారి కె.రామారావు, మహిళా కార్యకర్తలు అరుణకుమారి, నరసమ్మ, ఆళ్లభ్రమ రంభ దేవి, ధనలక్ష్మి, రమాదేవి, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, రామిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షుడిగా 'రావూరి'


రావూరి రమేష్

ప్రజాశక్తి- పంగులూరు


టిడిపి పంగులూరు మండల అధ్యక్షుడిగా రావూరి రమేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా రమేష్ బాబు ఎన్నికవటం ఇది రెండవసారి. పార్టీ సంస్థ గత ఎన్నికలు ముప్పవరం లోని పార్టీ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా అత్తింటి రవి, ఉపాధ్యక్షుడదిగా ఇరిగల అచ్చిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా బాచిన సురేష్ , రావిపాటి సుజాత, తన్నీరు శ్రీనివాసరావు, కార్యదర్శులుగా తోకచిచ్చు అచ్చిరాజు, కొత్తపల్లి సుజాత , వల్లేరు మేరమ్మ, కోశాధికారిగా రాగిబోయిన హరికష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీకి ప్రభుత్వానికి వారధిగా ఉంటూ పజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న జయబాబు

ముగిసిన కుట్టు శిక్షణ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అద్దేపల్లిలో నిర్వహించిన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. మహిళా సాధికారత కోసం ఇలా శిక్షణా తరగతులు అవసరమని ఎస్‌బిఐ విశ్రాంత చీఫ్ మేనేజర్ బొలిశెట్టి జయబాబు తెలిపారు. మరో వారంలో రోజులలో మూడో విడత శిక్షణా తరగతులు అద్దేపల్లిలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ శిక్షణా తరగతులు జయబాబు ఆర్థిక సహాయముతో నిర్వహిస్తున్నట్లు బిఎఫ్ బీసీ సభ్యులు పోలిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు శ్రీనివాసరావు చెప్పారు. దీనిలో భాగంగానే కుట్టు శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు పేద మహిళలకు రెండు కుట్టు మిషన్లు ఉచితం అందదజేశారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు బిఎఫ్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎఫ్ఎ ఇసి సభ్యులు వంగర బాబూజీ, పసుపులేటి శివరామప్రసాద్, ట్రైనర్ బి.నాగమణి, మహిళలు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న ఇంకొల్లు రంగారావు

రంగారావుకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి-చెరుకుపల్లి : చెరుకుపల్లి మండలానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా గౌరవాధ్యక్షుడు ఇంకొల్లు రంగారావు గురుబ్రహ్మ జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాదులోని కళాభారతి సిటీ కల్చరల్ సెంటర్ మనం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రంగారావుకు అవార్డు అందజేశారు. మన ఫౌడేషన్ నిర్వాహకులు డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంగారావుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రంగారావును మండల పరిధిలోని ప్రముఖులు, ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక నాయకులు కాటూరి నాగేశ్వరరావు, చార్వాక్, నిత్యానంద, వేదాంసిక శ్రీ ప్రత్యేకంగా అభినందించారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

ప్రజాశక్తి -బాపట్ల

వరి పైరుకు అవసరమైన దశలో యూరియాను రైతులకు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఎరువుల బ్లాక్ మార్కెట్ పై అన్నదాత పోరు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ అవసరమైన డెల్టా ప్రాంతంలో యూరియా సరఫరాను వదిలేసి అవసరం లేని అద్దంకి ,పర్చూరు నియోజకవర్గాల్లో గిడ్డంగులు నిండా యూరియా స్టాక్ ఉంచారన్నారు. టిడిపి నాయకులు కార్యకర్తలు ఇళ్లల్లో యూరియా బస్తాలు నిల్వలు ఉంటున్నాయని ఆయన ఆరోపించారు. యూరియా కావాలంటే టిడిపి వాళ్ళ ఇంటికి వెళ్లి చేతులు కట్టుకొని అడుక్కోవాల్సిన దుస్థితి రైతులకు దాపురించిందన్నారు. అవసరమైన చోట లేకుండా అవసరం లేని చోట్ల యూరియా బస్తాల నిల్వలు ఉంటున్నాయి. దీంతో జిల్లాలోనే ఆ ఊరికి ఈ ఊరికి తగాదాలు పెట్టేలా కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు నాట్లు వేసినప్పటి నుంచి కోత కోసి ధాన్యాన్ని అమ్ముకునే వరకూ వ్యవసాయంలో అండదండలు అందించినట్లు తెలిపారు. రైతుల కోసం ధర్నాలే కాదు అవసరమైతే నిరసన కార్యక్రమాలు చేయడానికి సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎరువుల కోసం అన్నదాత రోడ్డు ఎక్కితే కనీసం పట్టించుకున్న వారే లేరన్నారు. డెల్టా ప్రాంతంలో అనేక చోట్ల ఎరువుల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. అనంతరం బాపట్ల ఆర్‌డిఒ గ్లోరియాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, వైసిపి పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, జాలిరామిరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్, రెడ్డింకయ్య, ఇనగలూరి మాల్యాద్రి, తన్నీరు అంకమ్మరావు, మండే విజయకుమార్, చెన్నకేశవులు, జోగి రాజా, శ్రీహరి ప్రకాశ్, అడే చందు తదితరులు పాల్గొన్నారు.



బాపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

రేపల్లె : కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులు యూరియా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు విమర్శించారు. వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు రైతు పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత పట్టణంలోని బేతపూడి.. ఇసుకపల్లి కూడలి వద్ద నుంచి భారీగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్ స్టాండు సెంటర్ వద్ద ఉన్న దివంగత నేత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి, తాలుకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, వైసీపీ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. రైతు సమస్యలపై పోరాడుతుంటే 30 పోలీస్ యాక్ట పేరుతో అణచివేయాలని చూడటం అవివేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్న రైతులకు యూరియా అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో చూసిన యూరియా, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో లేక రైతులు ఆందోళన చెందటం బాధాకరం అన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తూ పీఏసీఎస్ ల వద్ద బారులు తీరుతుంటే, యూరియా నిల్వలు సమద్ధిగా ఉన్నాయని ప్రభుత్వం చెప్పటం హాస్యాస్పదం అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్, పట్టణ అధ్యక్షుడు శేషగిరిరావు, నాయకులు, చిత్రాలు ఓబేదు, చిమటా బాలాజీ, అబ్దుల్ కుద్దూస్, కిరణ్, ఆలా రాజా పాల్, ప్రభు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చీరాల : రైతులకు ఎరువులు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జు తెలిపారు. ఎరువుల బ్లాక్ మార్కెట్ విక్రయాలకు వ్యతిరేకంగా, రైతన్నలకు అండగా వైసిపి ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక ముక్కోణం పార్క్ సెంటర్‌లో డాక్టర్ అంబేద్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి ఆర్‌డిఒ చంద్ర శేఖర్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షులు, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


చీరాలలో ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు


రేపల్లెలో ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

యూరియా పంపిణీ కేంద్రం వద్ద

అధికార పార్టీ నేతల హల్‌చల్

- రైతులు యూరియా తీసుకోకుండా అడ్డగింత
- స్లిప్పులు లాకున్న వైనం
- తమవారికే ఇవ్వాలని అధికారులకు హుకుం జారీ


ఎరువుల పంపిణీ కేంద్రంలో కూర్చున్న టిడిపి నాయకుడు

ప్రజాశక్తి-వేమూరు

యూరియా కొరత ఆందోళనకు ఆజ్యం పోసినట్లుగా అధికార పార్టీ నాయకులు వ్యవసాయ సిబ్బంది పక్కనే కూర్చుని ముందుగా తమ పార్టీ వారికే యూరియా ఇవ్వాలని, ఆ తర్వాతే ఎవరికైనా అంటూ హుంకు జారీ చేస్తున్నారు. వేమూరు మండలం పెనమర్రు గ్రామాల రైతులకు యూరియాను పంపిణీని వ్యవసాయ. రెవెన్యూ సిబ్బంది మంగళవారం ప్రారంభించారు. అదే సమయంలో అధికార పార్టీకి చెందిన నేతలు అక్కడకు చేరుకొని క్యూలో నిలబడ్డ రైతులకు బయటికి పంపారు. ముందుగా తమ పార్టీ నాయకులకే యూరియా అందిస్తామని ఆ తర్వాతే ఇతరులకని చెప్పాడు. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన ఓ ముఖ్య నాయకుడు దగ్గరుండి మరి అటు అధికారులను, ఇటు రైతులను చెదిరింపులకు గురిచేశారు. తొలుత ఓ రైతు యూరియా కోసం క్యూలో నిలబడి అధికారుల వద్ద స్లిప్పు రాయించుకున్నాడు. యూరియా తీసుకునే సమయానికి గోపాలకృష్ణ అక్కడికి వచ్చి ఆ రైతు చేతిలోని స్లిప్పును లాగేసుకున్నాడు. యూరియా తీసుకోకుండా అడ్డుకున్నాడు. ముందు తమ పార్టీ నాయకులకే ముందు ఇస్తామని, ఇతరులకు ఒక బస్తా యూరియా కూడా ఇచ్చేది లేదని బెదిరించాడు. చావలి గ్రామ రైతులకు యూరియాను పంపిణీ చేశారు. ఇప్పటికే చావలి గ్రామానికి అవసరానికి మించి యూరియాను పంపిణీ చేశారని, మళ్లీ వారికే పంపిణీ చేయడం ఏమిటని రైతులు వాపోయారు. ఈ విషయాన్ని రేపల్లె ఏడీఏ దష్టికి తీసుకెళ్లండతో కొంత మంది రైతులకు యూరియా అందజేశారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేత

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని పాత మాగులూరు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త మాడ గోపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. అందులో భాగంగా గోపి కుటుం సభ్యులు జనసేన పార్టీ తరపున రూ.5 లక్షల చెక్కును జిల్లా నాయకులు సమక్షంలో క్రియాశీలక వాలంటరీ అడపాల సాయి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. తొలుత గోపి చిత్రపటానికి పూల మాలలు వేసి ఎ నివాళులర్పించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంపిన సందేశాన్ని జిల్లా జనసేన కార్యదర్శి చల్లా వెంకటకష్ణారావు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా యువ నాయకులు బాలినేని ప్రణీత్ రెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, నాయకులు మలగా రమేష్, కందుకూరి బాబు, బెల్లంకొండ సాయిబాబు, సెంట్రల్ ఆఫీస్ ప్రతినిధులు, నియోజకవర్గ జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంకణాల రమాదేవి

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలి

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

నిత్యం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి విమర్శించారు. మంగళవారం నాడు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ సమావేశం ఒంగోలు ఎల్బీజీ భవన్ లో జరిగింది. జిల్లా అధ్యక్షురాలు ఎస్.డి. శర్మిల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకురాండ్రు జి. ఆదిలక్ష్మి, బి. రాజ్యాలక్ష్మి, కె. లక్ష్మీ ప్రసన్న, కె. రాజేశ్వరి, ఎస్.కే. షమీల, ఏ. విశ్రాంత, డి. నారాయణమ్మ పాల్గొన్నారు.

జెసిఐ స్వర్ణోత్సవ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ



మాట్లాడుతున్న ఐపీఎస్ అధికారి రాధిక

జెసిఐ వంటి సంస్థలు యువతలో సేవాభావాన్ని పెంపొందించి, ఉన్నత లక్ష్యాల సాధనలో తోడ్పడతాయని ఐపీఎస్ అధికారి రాధిక పేర్కొన్నారు. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) స్వర్ణోత్సవ వారోత్సవాలు మంగళవారం నాడు కాపు కల్యాణమండపంలో ప్రారంభం అయ్యాయి. ప్రారంభ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి రాధిక, జెసిఐ జోన్ పూర్వ అధ్యక్షుడు రాహుల్ వేదాంతం, జెసిఐ ఇండియా జెండాను ఎగురవేయగా, జేసిఐ ఆద్యులు నామినేని మోహన్‌రావు దీపప్రజ్వలన చేశారు. జాతీయ పూర్వ అధ్యక్షుడు పిపిపి నయనాల రామకృష్ణ ఆటల పోటీలకు శ్రీకారం చుట్టారు. అనంతరం జెసిఐ స్వర్ణోత్సవ లోగోను అతిథులందరూ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక సేవా రంగంలో విశేష కషి చేసిన సీనియర్ సిటిజన్లకు లైఫ్ టైమ్ సర్వీస్ మెంబర్ అవార్డులు ప్రదానం చేశారు.జెసి వీక్ చైర్మన్‌గా పి.శివకోటిరెడ్డి, కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.బాలసుబ్రమణ్యం వ్యవహరిస్తుండగా, కో-చైర్మన్లుగా పి.శబరినాథ్ నాయర్, గంధవల్ల బాలకష్ణ, పి.అనిల్ ఉన్నారు. కార్యక్రమంలో జెసిఐ రాష్ట్ర నాయకులు లక్కం రవీంద్ర, కె.గోపి కిశోర్, కె.వరుణ్ కుమార్, బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత న్యామతుల్లా, జెసిఐ ఒంగోలు అధ్యక్షుడు ఎం.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

ట్యాంకర్ల డ్రైవర్స్ యూనియన్ ఆవిర్భావం

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేష్, వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ది సూరారెడ్డిపాలెం ఐఒసి, బిపిసి ట్యాంకర్ల డ్రైవర్స్ హెల్పర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆవిర్భవించింది. యూనియన్ గౌరవాధ్యక్షులుగా ఏఐటియుసి సీనియర్ నాయకులు ఎస్‌డి సర్దార్‌ను ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షులుగా పివి.సురేష్, ప్రధాన కార్యదర్శిగా కొత్తకోట వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులు ఎం.కోటేశ్వర రావు, కార్యదర్శిగా డి అబ్రహం, సహాయ కార్యదర్శిగా జి.కొండలు, ఈ.హరిబాబు కోశాధికారిగా కె.హరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు కార్మికులకు యూనియన్ ఆవశ్యకతను వివరించారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్‌డి.సర్దార్ మాట్లాడుతూ జిల్లాలో 26 యూనియన్లు ఏఐటియుసి అనుబంధంతో నడుస్తున్నాయని, కార్మికుల హక్కుల కోసం కార్మికుల సమస్యలపై కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. సిపిఐ నగర కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు కొత్తగా ఎన్నికైన యూనియన్ కొత్త కార్యవర్గానికి, ఎన్నికైన సభ్యులందరికీ అభినందనలు తెలియజేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు



రణభేరి ప్రచార బైక్ జాతా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వం బోధనేతర పనుల పేరుతో ఉపాధ్యాయులపై అధిక భారం మోపుతున్నారని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆటంకాలు కలుగుతున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రణభేరి ప్రచార బైక్ జాతాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆన్లైన్ వర్క్, రిజిస్టర్ల నిర్వహణ, పలు శిక్షణా కార్యక్రమాలు, బయోమెట్రిక్ పనులు వంటి కారణాలతో బోధనకు సమయం తగ్గిపోతుందన్నారు. మరో వైపు ఉపాధ్యాయులు అనేక ఆర్థిక, విద్యా రంగ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్‌హై మాట్లాడారు. యుటిఎఫ్ రాష్ట్ర స్థాయి రణభేరి బైక్ జాతా ఈ నెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు జరుగనుందని తెలిపారు. ఇందులో భాగంగా జాత 18వ తేదీన కనిగిరిలో ప్రవేశించి, గిద్దలూరు, బెస్తవారిపేట, కంభం, మార్కాపురం, పొదిలి, దర్శి, చీమకుర్తి మీదుగా ఒంగోలుకు చేరుతుందని వివరించారు. ఆయా సెంటర్లలోని యుటిఎఫ్ కార్యకర్తలు విరివిగా పాల్గొని జాతను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.రవి, ఉమామహేశ్వరి, ఎం.చిన్నస్వామి, ఎం.సంధ్యారాణి, నల్లూరి వెంకటేశ్వరరావు, ఎం. బాలరాజు, సిహెచ్. ప్రభాకర్‌రెడ్డి, దార్ల శ్రీనివాసులు, ఆర్.నారాయణ, జోష్నాదేవి, వై.వెంకట్రావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ఒంగోలు నగర కార్పొరేషన్‌తో పాటు అన్ని మున్సిపాలిటీల్లో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐటిసి సంస్థ వెల్-బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కాన్సెప్ట్‌తో చొరవ తీసుకోవడం అభినందనీయమని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా తెలిపారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా వ్యర్థాల నిర్వహణ సోర్స్ సెగ్రిగేషన్‌కు సంబంధించి ఐటిసి, ఎజిఎస్ సంస్థలు ఒంగోలు నగరంతో పాటు కనిగిరి, మార్కాపురం మున్సిపాలిటీలతో ఎంఓయు చేసుకున్నారు. ఈ విషయంపై మంగళవారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆమె ఒంగోలు నగర మున్సిపల్ కమిషనర్‌తో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమీషనర్లతో, ఐటిసి, ఎజిఎస్ సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ సంస్థ ప్రతినిధి సుధారాణి వెల్-బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ (డబ్ల్యుఓడబ్ల్యు) కాన్సెప్ట్ తో చేపట్టనున్న వ్యర్థాల నిర్వహణ, సోర్స్ సెగ్రిగేషన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఇప్పటికే ఒంగోలు నగరంతో పాటు కనిగిరి, మార్కాపురం మున్సిపాలిటీలతో ఎంఓయు చేసుకున్నట్లు ఐటిసి ప్రతినిధి సత్య శ్రీనివాస్ కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మెప్మా పీడీ శ్రీహరి, ఎజిఎస్ సంస్థ ప్రతినిధి అశోక్, సార్డ్స్ ప్రతినిధి సునీల్ కుమార్, నాగేంద్ర, రాజశేఖర్, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టని ప్రభుత్వం

అన్నదాత పోరు కార్యక్రమంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని, అన్నదాతగా పేరొందిన రైతన్నకు సమృద్ధిగా ఎరువులు సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని వైసిపి నేతలు మండిపడ్డారు. అన్నదాత పోరు కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పిలుపు మేరకు మంగళవారం నాడు ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాలకు చెందిన ఆ పార్టీ శ్రేణులు, రైతులు ఆర్ ఓ కార్యాలయం వద్దకు ర్యాలీ, ప్రదర్శన చేపట్టారు. మాజీ మంత్రి, కొండపి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో మూడు నియోజకవర్గాలకు చెందిన మండల పార్టీ అధ్యక్షులు, ఇతర శ్రేణులు వందలాదిగా ఉదయం 10.30 గంటలకు అంబేద్కర్ భవన్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సురేష్, ఒంగోలు ఇన్‌ఛార్జి రవిబాబు మాట్లాడుతూ ఎరువుల కొరత, గిట్టుబాటు ధరలతో ఆందోళన చెందుతున్న రైతులగోడు ఈ ప్రభుత్వానికి పట్టడం లేదని దుయ్యబట్టారు. అనంతరం అంబేద్కర్ భవన్ నుంచి ప్రదర్శన చేపట్టారు. ప్రదర్శన కోలాస్ వద్ద అంబేద్కర్ బొమ్మ వద్దకు చేరగానే పోలీస్ అధికారులు ర్యాలీకి అనుమతి లేదని అడ్డగించారు. ఆర్‌డిఒకు వినతిపత్రం ఇచ్చేందుకు కేవలం 20 మందిని మాత్రమే అనుమతించడంతో వైసిపి నాయకులు అక్కడ వున్న బాబూ జగజ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి.. ప్రదర్శనగా ఆర్‌డిఓ కేంద్రం వద్దకు చేరుకున్నారు. అక్కడకు వందలాది మంది చేరుకోవడంతో అక్కడ పోలీసులు అడ్డగించారు. వినతిపత్రం ఇచ్చేందుకు అయిదారుగురుని మాత్రమే అనుమతించడంతో చర్చి సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి.. అనంతరం ఆర్‌డిఓ లక్ష్మీప్రసన్నకు నేతలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, వైసిపి రైతు రాష్ట్ర నాయకులు మారెళ్ల బంగారు బాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు వెంకటేశ్వర రావు, సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, బొట్ల సుబ్బారావు, నగర కార్యదర్శి కఠారి శంకర్, మేరుగ చందన్‌నాగ్, దుంపా చెంచిరెడ్డి, రవణమ్మ, పోలినేని కోటేశ్వరరావు, పిన్నిక శ్రీనివాసరావు, వేమా శ్రీను, దుడ్డు వినోద్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఎంపీ మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఓటు వేసిన మాగుంట

ఉప రాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో మంగళవారం ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణదేవరాయలు, ఇతర పార్లమెంట్ సభ్యులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏమేలియమ్మ

బిజెపి నేత మోజేష్‌తో ప్రాణహాని

- భర్త ఆస్తులను కొట్టేయాలని బెదిరిస్తున్నారు..

- ప్రెస్‌మీట్‌లో బాధిత మహిళ ఏమేలియమ్మ ఆవేదన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బిజెపి నాయకులు పేముల మోజేష్‌తో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఒంగోలుకు చెందిన బాధిత మహిళ దుడ్డు ఏమేలియమ్మ ఆరోపించారు. బాధితురాలికి మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య అండగా నిలిచారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితురాలు ఏమేలియమ్మ వివరాలు వెల్లడించారు. తన భర్త జయచంద్రరావు విద్యుత్ శాఖలో ఉద్యోగం చేస్తూ 2025 జనవరి 25న మరణించారని, అనంతరం ఫిబ్రవరి 25న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొని ఒంగోలు తహశీల్దార్ కార్యాలయంలో సంప్రదించానన్నారు. 8 నెలలు గడుస్తున్నా ఇంత వరకు సర్టిఫికెట్ ఇవ్వకపోగా కుంటి సాకులు చెబుతూ తహశీల్దార్ కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భర్త తరుపున బంధువులు నాపై అనేక ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. వారికి వత్తాసుగా తన భర్త ఆస్తులను కాజేయాలనే ఉద్దేశంతో బిజెపి నాయకుడు పేముల మోజేష్, రాజారావు, సురేష్ తనపై దౌర్జన్యానికి, దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి నుండి తనకు బిడ్డకు ప్రాణహాని ఉందని, కుటుంబానికి రక్షణ కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు. ప్రెస్‌మీట్‌లో సంఘం నాయకులు అనీల్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ప్రకాష్

డాక్టర్ ప్రకాష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ జన్మదిన వేడుకలు హాస్పిటల్ సిబ్బంది సమక్షంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్ కన్సల్టెన్సీ డాక్టర్స్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వేడుకలలో హాస్పిటల్ డైరెక్టర్స్ డాక్టర్ ఉమాపతి చౌదరి, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు , హాస్పిటల్ కన్సల్టెన్సీ డాక్టర్స్ శ్రీధర్, శ్రీనివాసరావు, సువర్ణరాజు, పవన్, సాత్విక్, జయవర్ధన్, రాధ, పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సమతానగర్, పీర్లమాన్యం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ పేర్నమిట్ట, ద్వారక నగర్, లింగారెడ్డి అపార్ట్మెంట్స్ ఏరియా తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఏడు గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి.పాండురంగారావు తెలియజేశారు.

- డి4 పరిధిలో 11 కెవి లైన్ పాపాకాంప్లెక్స్ ఫీడర్ మరమ్మతు మరియు ట్రీ కటింగ్ కారణంగా పాపా కాలనీ, బిలాల్ నగర్ ప్రాంతాలకు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి.ఈ.ఈ కె.వి.పాండురంగారావు తెలిపారు.

5 పాఠశాలల ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పురస్కారాలు అందజేయనున్నట్లు డిఇఓ ఏ.కిరణ్ కుమార్ మంగళవారం నాడు ఒక ప్రకటన లో తెలిపారు. జిల్లా లో క్రీడల్లో ప్రతిభ కనబరచిన ఐదు పాఠశాలలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

బైటమంజులూరులో వైద్య శిబిరం

జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరణ

ప్రజాశక్తి - పంగులూరు

బైట మంజులూరును చుట్టుముట్టిన విష జ్వరాలు అనే శీర్షికతో ప్రజాశక్తిలో ఇటీవల ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి వైద్య అధికారులు స్పందించారు. బైట మంజులూరు గ్రామంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరం పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. రక్త నమునాలను పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్‌కు పంపినట్లు స్థానిక వైద్యుడు డాక్టర్ శివచెన్నయ్య తెలిపారు. 35 మంది రోగులలో పదిమందికి జ్వరం ఉన్నట్లుగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. డెంగీ, మలేరియా నిర్ధారణ కోసం రాపిడ్ యాంటిజెన్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఫలితాలు నెగిటివ్ గా వచ్చాయని డాక్టర్ శివ చెన్నయ్య చెప్పారు. పదిమంది నుంచి రక్త నమూనాలను సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ కు పంపినట్లు ఆయన చెప్పారు. ల్యాబ్ పరీక్షలు పూర్తయ్యాక ఫలితాలు వెల్లడవుతాయని చెప్పారు. గ్రామంలో జ్వరాల సంఖ్య అధికంగా ఉన్నందువలన, వాటిని తగ్గించడానికి ఆబేట్, బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేసినట్లు తెలిపారు. మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వదిలినట్లు తెలిపారు. ఫాగిన్, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించామన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు గుంటూరు ప్రాంతీయ ల్యాబ్ సహకారంతో తాగునీటి పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కొన్ని రక్తనా మోనాలను ఇప్పటికే ఐజిఎం ,ఐజిజి, డెంగీ యాంటీ బాడీస్ పరీక్షల కోసం బాపట్ల ఏరియా హాస్పిటల్ కు పంపించామన్నారు. బాపట్ల ఏరియా హాస్పిటల్ నుంచి ఫలితాలు రాగానే వాటిని ప్రకటిస్తామని చెప్పారు.



జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి కథనానికి స్పందన



నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు

సూరమ్మకు అశోక్‌బాబు నివాళి

ప్రజాశక్తి- భట్టిప్రోలు

భట్టిప్రోలు మండల పరిధిలోని కోనేటిపురం గ్రామానికి చెందిన వైసిపి మండల మాజీ కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు మృతమూర్తి మోర్ల సూరమ్మ సోమవారం రాత్రి అనారోగ్యంతో మతి చెందారు. ఈ విషయం గురించి తెలుసుకున్న వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు సూరమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో వైసిపి మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు, నాయకులు మోర్ల సత్యనారాయణ, శేఖరం ఉన్నారు.

అధికారులు నిబంధనలు పాటించాలి


ప్రజాశక్తి-వేటపాలెం

సుమోటో కుల ధవీకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌డిఒ చంద్రశేఖర్ నాయుడు ఆదేశించారు. స్థానిక తహాశీల్దారదు కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దారు మాట్లాడుతూ సుమోటో కుల ధవీకరణ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూదని తెలిపారు. ప్రతి కేసును నిష్పాక్షికంగా, నిబంధనలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే సేవలు అందించేలా అధికారులు కషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న రీసర్వే గురించి ఆరా తీశారు ఈ కార్యక్రమంలో డిఐఒ ఎస్.ముసలయ్య, తహాశీల్దారు గోపికృష్ణ, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

డ్రోన్ పనితీరు పరిశీలన

ప్రజాశక్తి-పర్చూరు.

డ్రోన్లను వినియోగించి నేరాలను అరికట్టవచ్చని ట్రైనీ ఎస్ఐ గోపి తెలిపారు. స్థానిక బొమ్మల సెంటర్లో పర్చూరు పిఎస్‌కు వచ్చిన డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది నేరుగా వెళ్లలేని ప్రదేశాల్లో నేరాలను అరికట్టడానికి పోలీస్ శాఖ ఆధునిక పద్ధతిని ఆరంభిస్తున్నదని తెలిపారు. ప్రకతి వైపరీత్యాలు వరదలు సంభవించినప్పుడు ముందస్తు ప్రమాద హెచ్చరికలను డ్రోన్లను వినియోగించి కనుక్కుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సాంబశివరావు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన అంకారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి -అద్దంకి

మండల పరిధిలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బొడ్డు చిన అంకారావు ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకునర్నారు. అందులో భాగంగా మంగళవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంకారావు సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో అనమానమూరు గ్రామ సర్పంచి జంపు హరిబాబు ఉపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు, అంకారావు బంధుమిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు.

విద్యార్థి వైద్య ఖర్చులకు ఆర్థిక చేయూత

ప్రజాశక్తి పర్చూరు.

మెదడు వాపు వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి వైద్య ఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయులు, అధికారులు, సమాజ హితవు కోరే ప్రజల సహకారంతో మంగళవారం ఆర్థిక చేయూతను అందించారు. మండల పరిధిలోని చెన్నంబొట్ల వారి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఐదో తరగతి చదువుతున్న పేర్లి సాత్విక్ అనే విద్యార్థి మెదడు వాపు వ్యాధితో బాధపడుతూ హస్పటల్లో చేరాడు. ఆ విద్యార్థి తల్లిదండ్రులు నిరుపేదలు. వారి శక్తి మేరకు రూ.3 లక్షల భరించారు. తాము హస్పటల్ ఖర్చు భరించలేము . ఆ విద్యార్థిని కాపాడండి అంటూ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.గోవిందరావు వద్దకు వచ్చి మొర పెట్టుకున్నారు. స్పందించిన ప్రధానోపాధ్యాయు ఉపాధ్యాయ దినోత్సవ వేడుక సమయంలో ఆపదలో ఉన్న విద్యార్థికి అందరూ చేయూత అందించాలని తెలిపారు. ఆ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు గోవిందరావు ఫోన్ పే నెంబరు ఇచ్చారు. దీంతో ఆ విద్యార్థిని ఆదుకోవడానికి ఉపాధ్యాయ లోకం, సమాజం స్పందించిన తీరు అమోఘం మాస్టారు మాటలు విశ్వసించి ప్రకాశం జిల్లా, బాపట్ల జిల్లా గుంటూరు జిల్లా వివిధ వాట్సఅప్ గ్రూపులు స్పందించిన తీరు ఊహకు అందలేదు. చేయూత అందించే ప్రతి ఒక్కరి లక్ష్యం మానవ సేవయే మాధవ సేవగా భావించి ఆర్థిక సహకారం అందించారు. మొత్తం మీద రూ1,91,900 నగదు మన మాస్టారు ఎకౌంటుకు జమ చేశారు. ఆ నగదును మండల విద్యాశాఖ కార్యాలయంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి , మండల విద్యాశాఖ అధికారులు , ఉపాధ్యాయులు, సమాజ శ్రేయోభిలాషుల సమక్షంలో విద్యార్థి తల్లి పేర్ని శిరీష అందజేయడం జ జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వెంకటస్వామి, ఎంఇఒలు శివ కోటేశ్వరరావు, వెంకట్రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నగదును అంజేస్తు న్న అధికారులు, ఉపాధ్యాయులు

22 నుంచే దసరా సెలవులు ఇవ్వాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 22న దేవీ నవ రాత్రులు ప్రారంభమవుతున్నందున పాఠశాలలకు ఆ రోజు నుంచే దసరా సెలవులు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చంపని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాఠశాల అకాడమీకు క్యాలెండర్‌లో భాగంగా ప్రతి సంవత్సరం దసరా సెలవులు మహాలయ అమావాస్య ప్రారంభ తేదీ ప్రామాణికంగా ఇస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు గుర్తు చేశారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే విషయాన్ని క్రమం తప్పకుండా పాటించి అమలు చేయాలని కోరారు. దేవీ నవరాత్రులు ప్రారంభమైన రెండవ రోజుల తర్వాత దసరా సెలవులు ఇవ్వడం సరికాదని, ప్రారంభం నుంచే సెలవులు ఇవ్వాలని కోరారు.

'చెన్నుపల్లి'కి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి-అద్దంకి



శ్రీవిరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధునిక ధార్మిక కళాపరిషత్ జాతీయ సాహితీ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ మరియు తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి విశ్వకర్మ జాతీయ పురస్కారాలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 17న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వకర్మ జాతీయ పురస్కారాలు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విశ్వబ్రాహ్మణులు విద్య వైద్యానికి ఎవరు ఇబ్బంది పడకూడదని అనే నినాదంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ దాతల సహకారంతో బాధితులకు రూ. 40. లక్షలు అందజేసినట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా చారి అందిస్తున్న సేవలును. గుర్తించి అద్దంకి వాసి చెన్నుపల్లి శ్రీనివాసా చారికి విశ్వకర్మ ఐకాన్ జాతీయ పురస్కార అవార్డుకు ఎంపిక చేసినట్లు కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, చైర్మన్ బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్‌చార్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలియజేశారు.ఈ పురస్కారాన్ని తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఈనెల 14న అతిథుల చేతుల అందజేయనున్నట్లు తెలిపారు.

11న ఆక్వా రైతుల సదస్సు

ప్రజాశక్తి- చీరాల

సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న విజయవాడలో నిర్వహిస్తున్న ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వేటపాలెం ఆక్వా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తేళ్ళ రామయ్య, ఆమంచి స్వాములు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా ఆంక్షలు తిప్పి కొట్టాలని, అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ఆక్వా రంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించాలని, ఫీడు రేట్లు తగ్గించాలనే డిమాండ్లతో నిర్వహిస్తున్న ఆక్వా జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి..కొండయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామారావు, రొయ్యల రైతు నాయకులు పి.శ్రీనివాసరావు,శ్రీనివాసరావు కోరారు.

13న 'అంగన్‌వాడీ' జిల్లా మహాసలు

ప్రజాశక్తి-చీరాల : ఎపీ అంగన్‌వాడీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు బాపట్ల జిల్లా రెండో మహాసభలు ఈనెల 13న చీరాలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి. రేఖ ఎలిజిబెత్ తెలిపారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహాసభల్లో గత మూడు సంవత్సరాల్లో నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించ నున్నట్లు తెలిపారు మహాసభలు విజయవంతం కావడానికి ప్రజలు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రమీల, జి. సుజీవన పాల్గొన్నారు.



వెంకట కష్ణారావు



షేక్ హుస్సేన్

ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పర్చూరు : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సిఫార్సుతో టిడిపి సీనియర్ నాయకులకు రాష్ట్ర కార్పొరేషన్లలో రెండు డైరెక్టర్ పోస్టులు వరించాయి. ఏపీ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండలానికి చెందిన కారుమంచి వెంకట కష్ణారావు, నూర్ బాషా దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్‌గా కారంచేడు మండలానికి చెందిన షేక్ హుస్సేన్ నియమితులయ్యారు. డైరెక్టర్‌గా తమ పేర్లను సిఫార్సు చేసిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు నూతన డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పుగుండూరులో పడకేసిన పారిశుధ్యం

- చెత్తచెదారంతో నిండిన కాలువలు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

పరిసరాలను పరిశ్రభత గా ఉంచడంతో పాటు గ్రామాలను శుభ్రంగా ఉంచి స్వచ్ఛత పాటించాలని ప్రభుత్వాలు ఊదరగొడతున్నాయి. ఆచరణలో అలా ఎక్కడా కనిపించడం లేదు. మేజరు పంచాయతీ అయిన ఉప్పుగుండూరులో పారిశుధ్యం పడకేసింది. ఏవీదిలో చూసినా చెత్తచెదారం, మురుగుతో నిండి సైడు కాలువలు దర్శనమిస్తున్నాయి. డంపింగ్ యార్డులేక 216 జాతీయ రహదారి ప్రక్కనే గ్రామంలోని చెత్త అంతా పడవేసి నిప్పుపెడుతున్నారు. ఫలితంగా దట్టమైన పొగ కమ్ముకోవడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కారణంగా బాట సారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాలువలు మురుగుతో నిండి దోమలకు ఆవాసంగా మారాయి. దోమల కారణంగా ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం పొంది ఉంది. కొన్ని వీధులకు 40 రోజులు దాటినా చెత్తబండి వెళ్ళని పరిస్థితి ఉంది. దీంతో గృహల్లోని చెత్త ఎక్కడ వేయాలో అర్థం కాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. చెత్త కారణంగా దుర్వాసన వెదజల్లుతోంది. దక్షిణం బజారులోకి చెత్తబండి వచ్చి 40 రోజులు దాటి పోయింది. ఫలితంగా కాలువలు, వీధులు చెత్త చెదారంతో నిండి పోయాయి.కాలువలు పిచ్చి మొక్కలతో నిండాయి. పురుగు బుట్టా చేరి ఎప్పుడు ఏ ప్రమాదానికి గురికావాల్సి వస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం వారానికి ఒకరోజైన చెత్త బండి వీధుల్లోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకుండా చెత్తా అంతా తీసుకొచ్చి పంచాయతీ కార్యాలయం ఎదుట పోసి నిరసన తెలుపుతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.


దక్షిణం బజారులో ఒక ఇంటిలో పేరుకు పోయిన చెత్త


చెత్త, పిచ్చిమొక్కలతో నిండిన సైడ్ కాలువ


అవార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-వేటపాలెం

వేటపాలెం జిల్లా పరిషత్ గర్ల్స్ హైస్కూల్లో క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 6, 7, 8 9వ తరగతి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పై టాలెంట్ టెస్ట్ మంగళవారం నిర్వహించారు. తొలుత ప్రశ్నాపత్రాలను ప్రధానోపాధ్యాయుడు దేవరకొండ సరోజిని, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాలనే కాకుండా సమకాలీన అంశాలపై, జనరల్ నాలెడ్జ్ పై పట్టు సాధిస్తే భవిష్యత్తులో వివిధ ఉద్యోగాలకు సంబంధించి పోటీ పరీక్షల్లో, ఇంటర్వ్యూలలో విజయం సాధించటం సులభం అవుతుందని అన్నారు. చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు ఉమ్మిటి వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ తరపున నిర్వహించే ప్రతిభా పరీక్షలు, క్విజ్, సమకాలీన సమస్యలకు సంబంధించి వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో పాల్గొనాలన్నారు. తద్వారా వ్యక్తిత్వ వికాసం, సమస్య పరిష్కారం, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ పెంపొందుతుందన్నారు. భావి భారత రథసారథులుగా తయారు అవుతారని తెలిపారు. పోటీల్లో ఆరవ తరగతి విభాగంలో ఎస్. నాగమనోజ్ఞ భార్గవి, బి. శ్రీకా, బి. నవ్య జ్యోతి, ఏడవ తరగతిలో బి. దినేష్, పి. మనోజ్ఞ, ఆర్. గాయత్రి, ఎనిమిదో తరగతిలో పి. సుధా నాగశ్రీ, పి. రవితేజ, ఏ. జోత్న హరిణి వరుసగా ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించారు. 9వ తరగతిలో డి. ఆరాధ్య, బి. శ్రీవల్లి, కె. షణ్ముఖ ప్రియ ప్రథమ స్థానం, షేక్ మొహసిన, డి. అనుదీపక్, కె. తేజేశ్వర్ ద్వితీయ స్థానం, పి. హేమంత్ తతీయ స్థానం సాధించారు. విజేతలకు చిల్డ్రన్ క్రియేటివ్ క్లబ్ తరపున వేణుగోపాలరావు బహుమతులు స్పాన్సర్ చేయగా, హెచ్.ఎం. డి. సరోజిని మరియు ఉపాధ్యాయులు అందజేశారు. టాలెంట్ టెస్ట్ విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ఉపాధ్యాయులు ఎవి. సుబ్బారావు, కె. సోమశేఖర్, పి. పోతురాజు, వి. జయంతి, బివి. కష్ణమూర్తి, గురుమణి, పి. సునీత, ఎం. నాగ సునీత, ఎం. బ్రహ్మానందరెడ్డికి చిల్డ్రన్స్ క్లబ్ తరపున వేణుగోపాలరావు ధన్యవాదాలు తెలిపారు. విజేతలకు అభినందనలు తెలియజేశారు.


అవార్డు అందుకుంటున్న ఖాజావలి

ఖాజావలికి ప్రత్యేక అవార్డు

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ఎంబిఎ విద్యార్థికి జెఎన్‌టియు కాకినాడ వారు ప్రత్యేక అవార్డు బహూకరించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు , కరస్పాండెంట్ ఎస్. లక్ష్మణ రావు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ వారి 18వ యూనివర్సిటి ఫార్మేషన్ డే సందర్భంగా కాకినాడ జెఎన్‌టియు పరిధిలోలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పలు దేశ విదేశాలలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మొదటి బహుమతిని స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి విద్యార్థి షేక్ ఖాజవలికి ప్రత్యేక అవార్డును బహూకరించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. జగదీష్ బాబు తెలిపారు. ఈ నెల 6న జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ 18వ యూనివర్సిటి ఫార్మేషన్ డే సందర్భంగా కాకినాడలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రసాద్ చేతులమీదుగా షేక్ ఖాజావలి కి ఈ అవార్డును ప్రదానము చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖాజావలికి కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాస రావు, సి. సుబ్బారావు, మేనేజర్ ఆర్‌వి. రమణ మూర్తి కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

యూరియాను నిల్వ చేయొద్దు

ప్రజాశక్తి - ముండ్లమూరు : యూరియాను అక్రమంగా నిల్వ చేయరాదని తహశీల్దారు లక్ష్మీ నారాయణ తెలిపారు. మండల పరిధిలోని మారెళ్ళ, నాయుడు పాలెం, పోలవరం గ్రామాల లోని రైతు సేవా కేంద్రాలలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ రైతులకు యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులు నల్ల బర్లీ పొగాకును సాగు చేయవద్దన్నారు. అనంతరం మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పూరిమెట్ల గ్రామంలో నిర్వహిస్తున్న జ్వరాలు క్యాంపును తనిఖీ చేశారు. పారిశుధ్యం పై ప్రజలకు, పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో షేక్ అబ్దుల్ రహీం, వ్యవసాయ అధికారి ఎ. తిరుమలరావు పాల్గొన్నారు.


నూతన కమిటీ ఇదే

అంగన్‌వాడీ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొల్లూరు

అమృతలూరు ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రెండవ మహాసభ కొల్లూరు లోని జగజీవన్ రావు కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 36 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు ప్రాజెక్ట్ అధ్యక్షురాలుగా పి.బసవమ్మ, కార్యదర్శిగా ఎస్.సుజాత ఎన్నికయ్యారు. యూనియన్ జిల్లా కార్యదర్శిగా రేఖ కొల్లూరులో జరిగిన మూడు సంవత్సరాల కాలంలో అమతలూరు ప్రాజెక్టు పరిధిలో చేసిన పోరాటాల గురించి వివరించారు. ఈ సమావేశంలో నీరజ సావిత్రి,స్వప్న, గహలక్ష్మి సౌభాగ్యం, నళిని ,మరియు సిఐటియు నాయకుడు టి. కష్ణమోహన్, బి ఆగస్టిన్, మనోజ్, బోనుగల సుబ్బారావు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షురాలుగా బి.బసవమ్మ, కార్యదర్శిగా సుజాత, కోశాధికారిగా రమాదేవి, ఉపాధ్యక్షులుగా ఐదుగురు, సహాయ కార్యదర్శులుగా ఐదుగురు, కమిటీ సభ్యులుగా 24 మందిని ఎన్నుకున్నారు.

ఎమ్మెల్యే ఆనందబాబు పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి- భట్టిప్రోలు

వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పుట్టినరోజు సందర్భంగా భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో సుమారు 1500 మొక్కలను పంపిణీ చేశారు.ఎపిఎం శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు, ఇతరులకు అందజేశారు. జామ, సీతాఫలం, నిమ్మ, రామా ఫలం మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆనందబాబు పుట్టినరోజు సందర్భంగా అందజేస్తున్న మొక్కలను జాగ్రత్తగా పెంచి పోషించి వీటి ఫలాలను భవిష్యత్ తరాలకు అందే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ శివపార్వతి, గహ నిర్మాణ శాఖ ఎఇ సౌమ్య రేవతి, సీసీలు నరేంద్ర, హానోకు, రజని, డ్వాక్రా యానిమేటర్లు పాల్గొన్నారు.


మొక్కలు పంపిణీ చేస్తున్న ఏపీఎం శ్రీమన్నారాయణ

అమృతలూరు : వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినం సందర్భంగా డాక్టర్ నక్కా అఖిలేష్ బాబు ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కాలేజ్ మరియు హాస్పిటల్ సహకారంతో అమర్తలూరు గ్రామంలో మంగలవారం ఉచిత మల్టీ స్పెషాల్టీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆనందబాబు పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రజలు అన్ని రకాల వైద్య సేవలు పొందటం అభినందనీయమన్నారు. ఈ శిబిరం ఆనందబాబు తనయుడు డాక్టర్ నక్క అఖిలేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం పట్ల ఆమె మండల ప్రజల తరపున కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్ర బాబు , ఎంపిడిఓ మారుతి శేషమాంబ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి- అద్దంకి

మండల పరిధిలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుచున్న విద్యార్థులకు బయాలజీ ఫోరమ్ వారు తయారు చేసిన జీవశాస్త్రం సడ్టీ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వంకాయలపాటి ప్రమీలా రాణి స్టడీమెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు ఈ సందర్భంగా దాతను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు విద్యార్థులు మెటీరియల్ ఉపయోగించుకుని మంచి మార్కులు సాధించాలని ప్రాధనోపాధ్యాయులు కెవి. శ్రీనివాస రావుచ ఉపాధ్యాయులు వీరాంజనేయులు అంకారావు, షంషుద్దీన్, శ్రీనివాసరావు. విజయలక్ష్మి రామ్మోహనరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

11న పవన్‌కళ్యాణ్ పర్యటన

నగరవనంలో అమరవీరుల స్థూపం ఆవిష్కరించనున్న డిసిఎం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈనెల 11న బాపట్ల పర్యటనకు రానున్నారని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా బాపట్ల మండలంలోని నగరవనంలో ప్రత్యేక కార్యక్రమం జరగనుందన్నారు. అంతరించి పోతున్న తాటి మొక్కలను సంరక్షించాలనే సదుదేశంతో నగరవనానికి వచ్చే మార్గంలో పవన్ కళ్యాణ్ తాటి మొక్కను నాటనున్నారు. అనంతరం నగరవనంలో అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరిస్తారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అటవీ సిబ్బందికి నివాళులు అర్పించనున్నారు. ఈ సందర్భంగా అమరవీరుల కుటుంబ సభ్యులతోనూ ఆయన సమావేశమవుతారు. పవన్ కళ్యాణ్ హెలికాప్టర్ ద్వారా బాపట్లకు రానున్నారని చెప్పారు. పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ తుషార్ డూడి పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పరిశీలనా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి,బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా ఇంచార్జి సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి వినోద్ తదితరులు ఉన్నారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలన

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ జిల్లా పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని సూర్యలంక నుంచి నగరవనానికి వచ్చే మార్గమధ్యంలో తాటి మొక్క నాటనున్న ప్రదేశాన్ని, నగరవనంలో అమరవీరులకు నివాళులు అర్పించనున్న స్థూప ఏర్పాటును, అమరవీరుల కుటుంబాలతో సమావేశం జరగనున్న ప్రదేశాలను జిల్లా ఎస్పీ పరిశీలించాడు. అదేవిధంగా సూర్యలంక నుంచి నగరవనానికి వచ్చే మార్గంలో ట్రాఫిక్, భద్రతాపరమైన అంశాలపై సమగ్రంగా సమీక్షించి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాపట్ల జిల్లాలో తొలిసారి పర్యటించనున్న నేపథ్యంలో, పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ప్రజల్లో ప్రజాదరణ కలిగిన నాయకుడిగా ఉండటంతో భద్రత దష్ట్యా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని స్పష్టం చేశారు.

లీకులు అరికట్టేందుకు మరమ్మతులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ప్రజాశక్తి కథనానికి స్పందన

మండలంలోని పెద్ద బొమ్మలాపురం పరిధిలో ఉన్న అతి పెద్ద చెరువుల్లో ఒకటైన గండి చెరువు రిజర్వాయర్ లీకులు అరికట్టేందుకు ఎట్టకేలకు జలవనరుల శాఖ అధికారులు రంగంలోకి దిగారు. 'చెరువుకు గండి' శీర్షికతో ప్రజాశక్తి మినీలో సోమవారం నాటి కథనానికి అధికారులు స్పందించారు. జలవనరుల శాఖ ఏఇ పి వెంకటరామిరెడ్డి మంగళవారం చర్యలు చేపట్టారు. చెరువు కట్ట ప్రాంతంలో లీకులతో వృథా అవుతున్న వర్షపు నీటిని నిలువరించేందుకు నాలుగు ట్రాక్టర్లతో ఇసుకను అక్కడకు చేర్చి వెయ్యి బ్యాగుల్లోకి నింపారు. లీకులను నివారించే పనిలో ఉన్నారు. చాలాకాలం తరువాత నిండిన చెరువులో నీరు వృథా కావడంపై రైతుల్లో కొంత ఆందోళన నెలకొంది. గండి చెరువు కట్ట శాశ్వత మరమ్మతులకు త్వరలో చర్యలు తీసుకుంటామని ఏఇ వెంకటరామిరెడ్డి హామీ ఇచ్చారు. మరమ్మతు పనుల్లో నీటి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి జిపిగా శివరామకృష్ణ నియామకం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



శివరామకృష్ణ

జిల్లా కోర్టు ఇన్‌చార్జి గవర్నమెంట్ ప్లీడర్‌గా ఒంగోలు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బి.వెంకట శివరామకృష్ణను నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేసు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు గవర్నమెంట్ ప్లీడర్‌గా శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

12న మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈనెల 12 శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు జరుగుతుందని ఒంగోలు మేయర్ గంగాడ సుజాత ఒక ప్రకటనలో తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిషేక్ ఇబ్రహీం షరీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ విద్యను విధిగా అభ్యసించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం మంగళవారం ఒంగోలు నగరంలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలోని చిన్నారులకు న్యాయ సేవలు అనే అంశంపై జిల్లా అధికారులతో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి ఎం.లక్ష్మా నాయక్, కార్మిక శాఖ అధికారులు ఎలిజిబెత్, పవన్ కుమార్, వైద్యశాఖ అధికారులు, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భగీరధి, సిడబ్ల్యుసి చైర్మన్ రామాంజనేయులు ఇతర జిల్లా అధికారులు మరియు ఎన్జీవో సంస్థ ప్రతినిధులు కట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

మాతా శిశు మరణాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎండిఆర్ సమావేశంలో, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో జిల్లాలో సంభవించిన మాత, శిశు మరణాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ మూడు నెలల కాలంలో ఒక బాలింత మతి చెందినట్లు అధికారులు వివరించగా, ఆ బాలింత మతికి కారణాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ వైద్యాధికారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఉన్న వసతులు, వైద్యుల గురించి ప్రశ్నించారు. బాలింత మతిపై వైద్యారోగ్య శాఖ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి సమగ్ర నివేదికను అందజేయాలని జిల్లా కలెక్టర్, వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ మాతృ మరణాలను నివారించడానికి, స్త్రీ గర్భం దాల్చినప్పటి నుంచి, ప్రసవం వరకూ అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకొనేలా చూడాలన్నారు. ప్రతీనెలా క్రమం తప్పకుండా పరీక్షలను నిర్వహించి, అవసరమైన మందులు, పోషక పదార్థాలు, తగిన సలహాలు సూచలను అందించాలని కలెక్టర్, వైద్యాదికారులను ఆదేశించారు. మరణం తరువాత చేసేది ఏమీ ఉండదని, సాధ్యమైనంత వరకు చిత్తశుద్ధితో కషి చేసి, ఆధునిక వైద్య సదుపాయాలు, తమ అనుభవం, వైద్య పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రాణాలను కాపాడాలన్నారు. తమ వల్ల కాదనిపిస్తే, వెంటనే నిర్ణయం తీసుకొని వీలైనంత త్వరగా పై ఆసుపత్రులకు పంపించాలని సూచించారు. అనంతరం జిల్లాలో 2024-25, 2025-26 లో జూలై వరకు జరిగిన గర్భాశయ శస్త్ర చికిత్సలపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యాల రావు, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యా రాణి, డిఐఓ డాక్టర్ కమలశ్రీ, ఐసిడిఎస్ పీడీ సువర్ణ, డాక్టర్ సంధ్య, పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌ను వేడుకగా నిర్వహించాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

సూర్యలంక బీచ్ లో ఈనెల 26, 27, 28 తేదీలలో జరగనున్న బీచ్ ఫెస్టివల్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ సోమవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫెస్టివల్‌ను వేడుకగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీచ్ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులను తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సముద్ర తీరం ఇసుకలో రాళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బాపట్ల నుంచి సూర్యలంక బీచ్‌కు వచ్చే రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లకంప చెట్లను తొలగించాలన్నారు. యంత్రాలతో వేగంగా జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, జిల్లా సంయుక్త కలెక్టర్ డి ఆర్ ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో గ్లోరియా తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.మజుందార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో,టాటా మ్యాజిక్ ట్రాన్స్ పోర్ట్ కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. మజుందార్ డిమాండ్ చేశారు. జిల్లాలోని పాత బస్టాండ్ ఆటో పాయింట్ వద్ద చలో విజయవాడ కార్యక్రమం లో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం, వాటిలో ఆటోల ద్వారా ఉపాధి పొందుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఏ మాత్రం కనికరంలేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగ ఉపాధి లేక నిరుద్యోగ యువకులు ఉన్నత చదువులు చదివి ఆటో డ్రైవర్లుగా మారుతున్నారు. ప్రభుత్వాలు వీరికి బ్యాంకుల ద్వారా రుణం ఇవ్వనందున ప్రైవేట్ ఫైనాన్సర్స్ దగ్గర అధిక వడ్డీలకు అప్పులతో ఆటోలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. అలాంటి వారి పై ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్ రేట్లు పెంచడం, ఇన్సూరెన్స్ ప్రీమియం రేట్లు, ఆర్టిఏ చలానాలు, ఈ చలానా ఫైన్లు, మ్యాట్రిక్స్ కెమెరాల సెన్సార్ ఫైన్‌లే కాకుండా ప్రైవేట్ ఫైనాన్సర్ల అధిక వడ్డీల దోపిడీలకు బలవుతున్నారు.కూటమి ప్రభుత్వం ఇప్పుడు రవాణా రంగాన్ని మొత్తం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచనతో ఇప్పటికే డ్రైవింగ్ లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీచేసే ఎ.టి.సి సెంటర్లను ఏర్పాటు చేసి రవాణా కార్యాలయాలను నిర్వీర్యం చేసింది.

ఆటో కార్మికులు ఒకసారి ఫిట్నెస్ సర్టిఫికెట్ కోసం ఎ.టి.సి సెంటర్ కు రూ. 860 చలానా చెల్లించాలి. అందులో ఫెయిల్ అయితే మరల చలానా రూ.660 చెల్లించాలి.వెహికల్స్ కు అన్ని అర్హతలు ఉన్నా సెంటర్ వారు ఉద్దేశపూర్వకంగానే ఫెయిల్ చేస్తున్నారు. వెహికల్స్ ఓనర్ కమ్ డ్రైవర్లు మరోసారి వెళ్లి సమయాన్ని వథా చేసుకోలేక ఎ.టి.సి. సెంటర్ వారికి అదనంగా వెయ్యి నుంచి వేల రూపాయల వరకు సమర్పించుకుంటున్నారు. ఈ ప్రభుత్వాలు వాహనదారులకు శిక్షలు చాలవు అన్నట్లు జి వో నెంబర్ 21ను తెచ్చి చిన్న చిన్న పొరపాట్లకు వేల రూపాయల్లో ఫైన్లు చేయడం జరుగుతుంది. ఇన్ని రకాలుగా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న వాహనాలపై ఆధారపడి ఉపాధి పొందుతున్న కార్మికులు చావలేక బతకలేని పరిస్థితుల్లో బ్రతుకులు వెళ్లదీస్తున్నారన్నారు. ఈ ఇబ్బందులను తొలిగించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మూలిగే నక్కపై తాటికాయ పడినట్టు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఏర్పాటు చేసి డ్రైవర్ల కుటుంబాలను పూర్తిగా ఇబ్బందులకి గురి చేసిందన్నారు.ఆటో, టాటా మ్యాజిక్, క్యాబ్, టాటా ఏసీ డ్రైవర్ల కార్మిక కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవరుకు సంవత్సరానికి రూ.30 వేలు చొప్పున ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అవినీతికి నిలయంగా మారిన ఎ.టి.సి సెంటర్ లను రద్దు చేయాలని కోరారు. డ్రైవర్‌ని జైలు పాలు చేసే ప్రమాదకర హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని, ఈ డిమాండ్లతో సెప్టెంబర్ అన్ని ఆటో ట్రాన్స్ పోర్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యాప్త ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు కె.శరత్, ఆటో వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షులు బుచ్చిరాజ, బ్రహ్మం, నాగరాజు సురేష్,నాని ఆటో కార్మికులు పాల్గొన్నారు.